రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న సీఐ మధుసూధన్‌రెడ్డి

మణికొండ: ప్రతి ఒక్కరు రోడ్డుపై ప్రయాణించే సమయాల్లో అన్ని రకాల నియమ నిబంధనలను పాటించాలని నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి. మధుసూధన్‌రెడ్డి సూచించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయన ఆధ్వర్యంలో గురువారం నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డుపై ఎడమ వైపునే ప్రయాణించాలని, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలను నడపవద్దని,హెల్మెట్‌లు, సీటు బెల్టులు ధరించాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు లింగయ్య, రాజేశ్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న తెలంగాణ ప్రాంత పోస్ట్‌మాస్టర్ జనరల్ శ్రీలత

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారంలో గురువారం తపాలాశాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు తపాలాశాఖ సేవలను తెలంగాణ ప్రాంత పోస్ట్‌మాస్టర్ జనరల్ శ్రీలత వివరించారు. గ్రామాల్లో తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌పీఓ హైమావతి, ఏఎస్‌పీ చలపతి, పోస్టుమాస్టర్ శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హోటల్ ప్రారంభం



ప్రశాంత్‌నగర్‌లో అప్నా రస్తా హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో అప్నా రస్తా నూతన హోటల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఈ హోటల్ భాగా లాభాలతో అభివృద్ధి చెందాలన్నారు. మంచి రుచికరమైన ఆహారాన్ని అందించి పలువురి మన్ననలను పొందాలన్నారు. హోటల్ యాజమాని సాయి టెక్ శేఖర్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, మేయర్ మహేందర్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్, పాపయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌కు నిధులు మంజూరు చేయండి



జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ అభివృద్ధికి సరైన నిధులను మంజూరు చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను తోటి కార్పొరేటర్లతో మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషనర్‌కు వివరించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరారు. డివిజన్‌లోని ప్రధాన సమస్యలను కమిషనర్‌కు తెలిపారు. రోడ్లు, వీధిదీపాలు, స్తంబాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఆగస్టులో ఆగిన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 40 రోజులు కావస్తున్న కౌన్సిల్ మీటింగ్ జరపడంలేదు. కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని అన్నారు.

బీజేవైఎం ఉపాధ్యక్షుడి నియామకం



నియామక పత్రాన్ని అందుకుంటున్న పుస్తకాల వంశీ

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లికి ప్రాంతానికి చెందిన పుస్తకాల వంశీ భారతీయ జనతా యువ మోర్చా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షులు రాకేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పుస్తకాల వంశీకి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకాల వంశీ మాట్లాడుతూ... పార్టీలో తాను అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ పదవీని అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించినందుకు బీజేవైఎం ముఖ్య నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొక్క బాల్‌రెడ్డి, బాబురావు, శ్రీకాంత్ రెడ్డి, విద్యాసాగర్, రాజ్‌పాల్, అక్షిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత ప్రముఖ్‌గా రాజశేఖర్



అత్తాపూర్: అయోధ్యలో శ్రీ రాముడి ప్రాణప్రతిష్ట శుభ సందర్భంగా అయోధ్య రామ రాజ్య ప్రశాసన్ రాచూరి రాజశేఖర్‌ను దక్షిణ భారత ప్రముఖ్‌గా నియమించింది. దక్షిణ భారత్‌లోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అండమాన్ నికోబార్, పాండిచ్చేరి, లక్షద్వీప్ 8 రాష్ట్రాలకు ప్రముఖ్ ఉంటారని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాచూరి రాజశేఖర్ మాట్లాడుతూ నాకు రామ రాజ్య ప్రశాసన్ అయోధ్య వారు నాపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత అప్పగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ మహోత్తరమైన బాధ్యతను తన్ మన్ ధన్‌తో నిర్వహిస్తానన్నారు. రామ రాజ్య ప్రశాసన్ జాతీయ ప్రశాసక్ భాస్కర్ సింగ్ రాజశేఖర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజశేఖర్‌ను నియమిస్తూ నియామక పత్రాని కేంద్ర ప్రభుత్వం హోంశాఖ, రాష్ట్ర ప్రభుత్వం హోంశాఖ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపించిందన్నారు.

మహిళల రక్షణకు తెలంగాణ పోలీస్ కృషి

సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ డీసీపీ కె.సృజన



కార్యక్రమంలో డీసీపీ సృజన

గోల్కొండ: బాలికలు, మహిళల రక్షణకు తెలంగాణ పోలీస్ ఎంతగానో కృషి చేస్తుందని దీనికి గాను పోలీసు శాఖలో మహిళా సేఫ్టీ వింగ్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ డీసీపీ కె.సృజన అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అభయ ఉమెన్స్ సేఫ్టీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ గరల్స్, చైల్డ్ డేలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను జీఎన్ఐటీఎస్ పూర్వ విద్యార్థి అయినందుకు ఎంతో గర్వపడుతున్నానన్నారు. తాను ఎంతగానో ఇష్టపడే ఉమెన్ సేఫ్టీ విభాగంలో తనకు పోస్టింగ్ రావడం తన అదృష్టమని పేర్కొన్నారు. నేడు సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న హింస, దౌర్జన్యాలను అరికట్టడానికి ఎన్నో చట్టాలు రూపొందించబడ్డాయని ఆమె అన్నారు. తాను చేస్తున్న కృషి వల్లే మహిళలపై జరుగుతున్న నేరాల సంఖ్య తగ్గిందని ఇటువంటి కేసుల్లో దోషులైన వారిని తాను పట్టువదలకుండా అరెస్టు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న కిమ్స్ ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ కావ్యప్రియ వజ్రాల కళాశాల విద్యార్థులతో మాట్లాడి శారీరక ధృడత్వం అవశకతపై వివరించారు. మనం శారీరకంగా, ధృడంగా ఉండడమే కాకుండా మానసికంగా కూడా ధృడంగా ఉండాలని దీన్ని వల్ల అన్యాయాలను, దౌర్జన్యాలను దైర్యంగా ఎదుర్కొగలుగుతామని అన్నారు. మిసెస్ యూనివర్స్–ఇంటిగ్రిటీ, గర్ల్ ఫౌండేషన్ ఫౌండర్ డైరెక్టర్ రోహిణి నాయుడు, కామ్ ఫర్ యూ డైరెక్టర్ ఆమీనాహుస్సేన్, లర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ డైరెక్టర్ హర్షాచావ్లా, అభయ జీఎన్ఐటీఎస్ ఉమెన్ సేఫ్టీ క్లబ్ కన్వీనర్ అపర్ణ, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయండి



కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న పాపయ్యయాదవ్, కాలనీల వాసులు

బండ్లగూడ: జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ నర్సారెడ్డి కాలనీ, డాక్టర్స్ కాలనీలలోని డ్రైనేజీ లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పాపయ్య యాదవ్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాపయ్యయాదవ్ మాట్లాడుతూ కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు నత్తనకడన జరుగుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్ల మధ్యలో డ్రైనేజీ లైన్ కోసం తవ్వకాలు చేసి మట్టిని వదిలేశారన్నారు. దీంతో వాహనాదారులు, పాదాచారుల రాకపోకలకు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. వెంటనే పనులను పూర్తి చేసి సమస్యలు లేకుండా చూడాలని కమిషనర్‌ను కోరామన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని త్వరితగతిన పనుపూర్తయ్యేల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సారెడ్డి కాలనీ, డాక్టర్స్ కాలనీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లు, ఫ్యూజర్ కిడ్స్ స్కూల్, నెమలినగర్ ప్రాంతాలలో మధ్యాహ్నం 1గంటల నుంచి 3గంటల వరకు, క్రిస్ విల్లాస్, వెస్టన్ లైన్, సర్వీస్ రోడ్లలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. వట్టినాగులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామం, ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు పరిధిలలో మధ్యాహ్నం 1గంటల నుంచి 3 గంటల వరకు, శ్రీదేవి ఇంజనీరింగ్ కళాశాల, వివేకానందనగర్ కాలనీ, ఇంద్రారెడ్డినగర్, ఎస్ఓఎస్ స్కూల్, అపర్ణ రెడీమిక్స్ ప్లాంట్, మూవీటవర్ ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ తీగలకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

పోలీసుల దాడికి నిరసనగా ఏబీవీపీ ధర్నా



వీసీ భవనం ముందు ధర్నాకు కూర్చున్న దృశ్యం

ఏజీవర్సిటీ: ఉద్యాన విశ్వవిద్యాలయాల భూములు హైకోర్టుకు కేటాయించవద్దని ధర్నా చేస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి పై మంగళవారం పోలీసుల దాడికి నిరసనగా బుధవారం రాష్ట్ర ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ముందు ధర్నా నిర్వహించారు. అక్కడి నుంచి ర్యాలీగా వీసీ భవనం ముట్టడించి ప్రభుత్వానికి వీసీకి, రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరికి బీజేపీ నాయకులు మద్దతు పలుతుకు ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం పోలీసులు 50 మంది ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వీరితో పాటు అడ్వకేట్స్ శారదా గౌడ్, వేణుమాదవ్, వెంకటేశ్వర్లు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పృథ్వి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నం

వ్యవసాయ పరిశోధలకు సంబంధించిన భూములను హైకోర్టు భవనాలకు కేటాయించవద్దని శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థుల పై పోలీసులు ప్రవర్తిస్తున తీరు చాలా దారుణమని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.విద్యాసాగర్ ,ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీ.రజనికాంత్ అన్నారు. ఈ విషయాని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. శాంతియుతంగా భూములను కాపాడాలని విద్యార్థులు ప్రయత్నిస్తున్నారని పోలీసులు విశ్వవిద్యాలయంలోకి వచ్చిన విద్యార్థుల పై దాడి చేయడం అమానుషమని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి, విద్యార్థులకు మద్య ఈ ప్రతిష్టంభన తొలగించడానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, విశ్వవిద్యాలయం ఇంచార్జి వీసీ ప్రయంత్నించాలని వారు డిమాండ్ చేశారు.

మంచి ప్రవర్తనతో మెలగాలి



పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు హెచ్చరిక చేస్తున్న ఇన్‌స్పెక్టర్

శంషాబాద్ రూరల్: రౌడీషీటర్లుగా రికార్డుల్లో నమోదైన వారు నేరాల వైపు ఆలోచన చేయకుండా మంచి ప్రవర్తనతో మెలగాలని ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనాథ్ సూచించారు. గురువారం వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఈ మేరకు హెచ్చరిక జారీ చేశారు. వారు చేస్తున్న పనుల గురించి ఆరా తీశారు. మొత్తం 13 మంది రౌడీషటర్లుగా ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



ఇన్‌స్పెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న స్థానికులు

శంషాబాద్ రూరల్: శంషాబాద్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న ఎస్.శ్రీనాథ్‌ను గురువారం స్థానికులు కలిసి సన్మానించారు. బీఆర్ఎస్ పార్టీ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు నేనావత్ లాల్‌సింగ్‌నాయక్ ఆయనకు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్. రతన్, భరత్, తుల్చారాం, హన్మంతు, మున్నా, వినోద్, అజయ్, చిన్నా, విజయ్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

మణికొండ: 35వ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని అపర్ణ కన్‌స్ట్రక్షన్, అపర్ణ జెనాన్ ప్రాజెక్ట్ సిబ్బంది, కార్మికులు రోడ్డు పై ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలో ఐటీ జోన్ సమీపంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థల సేఫ్టీ అసిస్ట్ జనరల్ మేనేజర్ ఎస్. అజయ్‌కుమార్, ఏవీపీ ప్రాజెక్ట్స్ కె. రామేశ్వర్‌రావు, డీపీఎం భద్రత చంద్రకాంత్‌రెడ్డి,హెచ్ఆర్ మేనేజర్ పవన్‌కుమార్‌లు రోడ్డు భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. యమ ధర్మరాజు వేషాదారణలో రమణబాబు హెల్మెట్, సీట్ బెల్ట్ తదితర ప్రాముఖ్యతలను వివరించారు.



పుప్పాలగూడలో రోడ్డు భద్రత వారోత్సవాలలో పాల్గొన్న సిబ్బంది

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

మణికొండ: మద్యం మత్తులో వాహనాలను నడిపి ట్రాఫిక్ పోలీసుల తనిఖీలలో దొరికిన ఇద్దరి వ్యక్తులకు కోర్టు జరిమానాలతో పాటు జైలు శిక్షలను విధించింది. నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.మధుసూధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల మద్యం తాగి వాహనాలు నడుపుతూ డి.గణేష్, ఇమానియల్‌లు తనిఖీలలో పట్టుపడ్డారు. దాంతో వారిపై కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరుపరుచగా గణేష్‌కు రూ. 6వేల జరిమాన 3 రోజుల జైలు శిక్ష, ఇమానియల్‌కు రూ. 3500లు జరిమానతో పాటు 2 రోజుల జైలు శిక్ష విదించారని పేర్కొన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడపవద్దని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సూచించారు.

సైబర్ క్రైమ్.. బాధితులకు రీఫండ్

రాయదుర్గం: ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు వచ్చిన 39 సైబర్ క్రైం కేసులలో బాధితులకు కోటి నలభై లక్షల రూపాయలను బాధితులకు రీఫండ్ చేశామని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. సైబర్ మోసానికి గురయితే వెంటనే 1930కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

హజ్రత్ అలీ జన్మదిన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

అత్తాపూర్: హజ్రత్ అలీ జన్మదిన వేడుకలను షియా ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఖయ్యూంనగర్, ఎంఎం పహాడి ప్రాంతాల నుంచి వేలాదిగా బయలుదేరిన ముస్లిం సోదరులు గురువారం సాయంత్రం మౌలాలి గుట్టపై ఉన్న ప్రార్థన మందిరానికి ర్యాలీగా బయలుదేరి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి బందోబస్తు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కృష్ణ, ఏఎస్సై హర్షద్ అలీ, స్పెషల్ టీమ్‌లతో పాటు ఏఆర్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధం



ఓటు హక్కు ఆవశ్యకత గురించి వివరిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్

ఏజీవర్సిటీ: ప్రజాస్వామ్య వ్యస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని మనల్ని పాలించే వారిని మనమే ఎన్నుకునే గొప్ప ఆయుధం ఓటు హక్కు అని శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం అసోసియెట్ డీన్ డాక్టర్ ప్రశాంత్ అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సం సందర్భంగా కళాశాలలో ఓటరు దినోత్సవాని ఘనంగా నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతిని ఉద్దేశించి మాట్లాడిన ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులకు వినిపించారు. అనంతరం డీన్ మాట్లాడుతూ విద్యార్థుల చేత ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియెగించుకునే విధంగా ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తి ఓటు హక్కును పొందాలని అన్నారు. ప్రధానంగా విద్యార్థులు ఓటు ఆవ్యశకతను అందరికి తెలియజేస్తూ సరైనా నాయకున్ని ఎన్నుకోవడం వల్ల దేశం ఆభివృద్ధి పథంలో నడుస్తుందని వివరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా యువత అవగాహన సదుస్సులను నిర్వహిస్తూ వారిలో చైతన్యం తీసుకరావాలన్నారు. డాక్టర్ కళాధర్ బాబు, ఎఎస్ఏ డాక్టర్ నాగహర్షిత, నంతోషిని, శ్రీరాములు, శ్రీనాథ వేణుగోపాల్ కృష్ణవేణి, మమత పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటర్‌గా పేరు నమోదు చేసుకోవాలి



ఓటర్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉప్పర్‌పల్లి యుపీపీఎస్ బిల్డింగ్ వద్ద యువ మోర్చా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గోనె శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి బొక్క బాల్‌రెడ్డి మాట్లాడుతూ... 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 8వ తేదీ ఓటర్ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని.. దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఓటర్ లిస్టులో తమ పేర్లు ఉన్నాయో.. లేదో తెలుసుకొని నమోదు చేసుకోవాలని... మార్పులు ఉన్న సవరణలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.బాబురావు, రాకేశ్ గౌడ్, రాజ్‌పాల్ రెడ్డి, పవన్, పుస్తకాల వంశీ, అక్షిత్ గౌడ్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ దినోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

రాజేంద్రనగర్: జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో గురువారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని మహిళా గ్రూపులకు ఈ పోటీలను నిర్వహించారు. మహిళలు ఓటర్లను చైతన్యపరిచేలా రంగురంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు.విజేతలకు శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో బహుమతులను అందజేయనున్నారు. సర్కిల్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల ఆధ్వర్యంలో టీడీపీ చౌరస్తాలో వద్ద అవగాహన ర్యాలీ చేపట్టారు.

కాంగ్రెస్‌తో అభివృద్ధి సాధ్యం



ఎల్‌బీ స్టేడియంలో జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బండ్లగూడ: రాష్ట్రం కాంగ్రెస్ పార్టీతోనే అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి అన్నారు. ఎల్‌బీ స్టేడియంలో జరుగుతున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బూత్ లెవల్ కన్వీనర్ల శిక్షణ శిభిరంలో కార్పొరేషన్ నాయకులు, కార్యకర్తలు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తలారి ప్రేమ్‌కుమార్, ఏ–బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్‌కుమార్, మాజీ సర్పంచ్ హరికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు





బండ్లగూడ: జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1 కోటి వరకు అక్రమాలకు పాల్పడిన మేయర్ మహేందర్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మద్దెల ప్రేమ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మేయర్ మహేందర్‌గౌడ్ తన సొంత డివిజన్ ఆదర్శనగర్ కాలనీలోనే అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కాలనీలో దాదాపు 10 సంవత్సరాల క్రితం స్థానికులు తమ సొంత నిధులతో 100 గజాల స్థలంలో కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ ఫ్లోర్‌ను పూర్తి చేసుకున్నారన్నారు. మొదటి అంతస్తులో కేవలం గోడలు నిర్మించడానికి సుమారు 40 లక్షల వ్యయం అయ్యిందని, ఇందుకోసం మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మించినట్లు చూపించారన్నారు. ఈ క్రమంలో గత ఏడాది అక్టోబర్ 9న శిలాఫలకాన్ని బుర్ర మహేందర్‌గౌడ్ చేతుల మీదుగా ప్రారంభించారన్నారు. కేవలం రూ.2–3 లక్షల వ్యయంతో జరిగే పనికి రూ.40 లక్షల ఖర్చు ఎలా అయ్యిందో చెప్పాలని ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. గతంలోనూ పూర్తయిన ఈ పనులను తనకు అత్యంత సన్నిహితుడైన కాంట్రాక్టర్‌తో కలిసి పనులను కొత్తగా చూపిస్తూ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయం కాలనీ వాసులకు తెలియడంతో అక్కడి శిలాఫలకాన్ని చోరీ చేసి.. కొత్తగా రూ.20 లక్షల వ్యయం అయినట్టు శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారని ప్రేమ్‌కుమార్ చెప్పారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయని గుర్తుచేశారు. ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానన్నారు.